క్లుప్తంగా

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకర్

కేవీపల్లె : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగ తీర్చి దిద్దడమే లక్ష్యంగా చేపట్టే ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీసీలు, సంఘమిత్రల వలంటీలర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 500 మంది నిరక్షరాస్యులు ఉన్నారని తెలిపారు. మండలంలో 50 కేంద్రాల ద్వారా ఒక్కో వలంటీరుకు పది మంది నిరక్షరాస్యులకు రాయడం, చదవడం నేర్పించాలన్నారు ఈ కార్యక్రమంలో ఏపీఎం అనురాధ, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

‘ఉల్లాస్’పై శిక్షణ

పీలేరురూరల్ : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగ తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీఓ జి. శివశంకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంఘమిత్రల వలంటీలర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై ఒక్క రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 600 మంది నిరక్షరాస్యులు ఉన్నారని, ఒక్కో వలంటీరుకు పది మంది చొప్పున మండలంలో 60 కేంద్రాల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిరక్షరాస్యులకు రాయడం, చదవడం నేర్పించడం తోపాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, సీసీ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పెన్షన్లు తనిఖీ

రామసముద్రం : ఎన్‌టీఆర్ భరోసా ఆరోగ్య పెన్షన్ల తనిఖీ ప్రక్రియలో భాగంగా జిల్లా వైద్యబృందం మంగళవారం మండలంలోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. చెంబకూరు, రామసముద్రం, అరికెల, ఎలవానెల్లూరు, ఆర్.నడింపల్లె, పెద్దకురప్పల్లె తదితర పంచాయతీల్లో నెలకు రూ.15వేలు పెన్షన్ పొందుతూ మంచానికి, వీల్ చైర్లకు పరిమితమైన లబ్ధిదారులకు సంబంధించిన పెన్షన్‌కార్డులు, వైకల్య ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాను ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మ సేవలో శివకోటి శ్రీమహాలక్ష్మీ పీఠాధిపతి


పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి అప్పాస్వామి

కలికిరి : కలికిరి గ్రామదేవత ఎల్లమ్మకు అనంతపురం జిల్లాకు చెందిన శివకోటిశ్రీమహాలక్ష్మీ పీఠాధిపతి అప్పాస్వామి పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ ఆవరణలో మంగళవారం చండీ యాగం అప్పాస్వామి చేతుల మీదుగా నిర్వహించారు. కలికిరితో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి యాగంలో పాల్గొన్నారు. అంతకు మునుపు పీఠాధిపతి అప్పాస్వామి ఎల్లమ్మకు విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకాదులు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అశోక్‌కుమార్‌రెడ్డి, నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, అర్చకులు శివకుమార్ శాస్త్రి, వెంకటరమణ, అప్పాస్వామి శిష్య బృందం తదితరులు పాల్గొన్నారు.

31న ఉచిత వైద్యశిబిరం

మదనపల్లె : మండలంలోని సీటీఎం క్రాస్‌రోడ్‌లో ఈనెల 31న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ బండపల్లి వెంకటరమణ తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ...మదనపల్లె సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనరల్ మెడిసిన్, ఎముకలు, దంతవైద్యంకు సంబంధించిన స్వాస్థ ఆస్పత్రి వైద్యులు శిబిరంలో పాల్గొని సేవలు అందిస్తారన్నారు. సీటీఎం క్రాస్‌రోడ్, సమీప గ్రామ ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత వైద్యశిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

గెనిసిగడ్డల సాగు..లాభాలు బాగు

- కిలో ధర రూ.19
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- బయట రాష్ట్రాల్లో మంచి డిమాండ్
- గ్రీసు తయారీలో గడ్డల వినియోగం


గెనిసిగడ్డలను పొలం నుంచి తీస్తున్న రైతులు


ఎగుమతికి సిద్ధం చేసిన గెనిసిగడ్డలు



గుర్రంకొండ : గెనిసిగడ్డల సాగు చేసిన రైతులకు ఈ ఏడాది సిరులు కురిపించాయి. టమాటా, కూరగాయలు, పూల సాగు కంటే ప్రస్తుతం రైతులకు లభాలు తెచ్చిపెట్టిన ఏకైక పంట గెనిసిగడ్డలు. జిల్లాలో ఈ ఏడాది గెనిసిగడ్డల సాగు తక్కువగా చేపట్టారు. దీంతో మార్కెట్లో వీటికి మంచి డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ. 19 వరకు ధర పలుకుతున్నాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఈ పంటలో కనిపిస్తున్నాయి. జిల్లాలోని పడమటి ప్రాంతాల్లో సాగు చేసిన గెనిసిగడ్డలకు బయట రాష్ట్రాల్లోని మార్కెట్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. వాహనాల కోసం వినియోగించే గ్రీసు తయారీ కోసం ఈ గడ్డలను ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు అక్కడి ఫ్యాక్టరీలకు ఎగుమతి చేసుకొంటున్నారు. గెనిసిగడ్డల సాగుపై రైతులు ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపిస్తుండడం గమనార్హం.

1350 ఎకరాల్లో సాగు:
జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు 1350 ఎకరాల్లో ఈఏడాది సాగు చేపట్టారు. గత ఏడాది 2650 ఎకరాల్లో పంటను సాగు చేయగా ఈ ఏడాది 50శాతం మేరకు సాగు తగ్గడం గమనార్హం. గెనిసిగడ్డల సాగుకు రబీసీజన్ ఎంతో అనుకూలం. పంటను సాగు చేసి ప్రస్తుతం కోతలు కోస్తున్నారు. సాధారణంగా అక్టోబర్ నుంచి జనవరి వరకు గడ్డలసాగు ఉంటుంది. దుక్కుల దగ్గర నుంచి తీగెల నాటడడం, ఎరువులు, కూలీలు, పంట చేతికొచ్చే వరకు మొత్తం సాగు ఖర్చు రూ.50 వేల లోపే ఉంటుంది. చీడపీడలు, రసాయనిక ఎరువుల వాడకం ఖర్చులు తక్కువగా ఉంటాయి. కూలీల అవసరం ఎక్కువగా ఉండదు. మొదట గెనిసిగడ్డల తీగెలు నాటే సమయంలోనూ, ఆ తరువాత పంట అదనుకొచ్చిన తరువాత గడ్డలను పొలంలో నుంచి గడ్డలు తవ్వి బయటకు తీసేందుకు మాత్రమే కూలీల అవసరం ఉంటుంది.

ఈ ఏడాది మంచి దిగుబడి:
ఈ ఏడాది గెనిసిగడ్డల సాగు మంచి దిగుబడిని ఇచ్చింది. ఎకరం పంటకు సాధారణంగా 7 టన్నుల నుంచి 9 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. అయితే ఈ ఏడాది 9 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి రావడం గమనార్హం. వీటిని గోనెసంచుల్లో నింపి మార్కెట్లకు తరలిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో గడ్డల ధర రూ.16 నుంచి రూ. 19 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈలెక్కన ఎకరాకు రూ.1.80 లక్షల నుంచి రూ.2.40 లక్షలు వరకు ఆదాయం వస్తోంది. పంట సాగు, పెట్టుబడి ఖర్చు పోనూ సరాసరి ఎకరానికి రూ. 1.30 లక్షల నుంచి రూ.1.90లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. గెనిసిగడ్డల తీగెలు పాడిఆవులకు పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా గెనిసి తీగెలను విత్తనపు తీగెలుగా అమ్ముకోవడం ద్వారా మరింత ఆదాయం వస్తోంది.

బయట రాష్ట్రాల్లో డిమాండ్:
గెనిసిగడ్డలకు బయట రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ గడ్డలను బెంగళూరు, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ మార్కెట్లకు ఇక్కడి రైతులు తరలిస్తుంటారు. మన రాష్ట్రంలోని కడప, తిరుపతి, గుంటూరు, విజయవాడ పట్టణాల్లోని మార్కెట్లకు తరలిస్తుంటారు. బయట రాష్ట్రాల నుంచి కొంతమంది వ్యాపారులు ఇక్కడికి వచ్చి పొలాల దగ్గరే గెన్సిగడ్డలను రైతల నుంచి కొనుగోలు చేసి తరలిస్తుంటారు.

11 టన్నుల దిగుబడి



ఎకరం పొలంలో ఈ ఏడాది గెనిసిగడ్డల సాగు చేశాను. ఎకరానికి రూ. 50వేలు వరకు సాగు ఖర్చు వచ్చింది. మిగిలిన పంటలతో పోల్చితే ఈ పంటకు పెట్టుబడి ఖర్చు చాలా తక్కువ. సుమారు 11 టన్నుల పంట దిగుబడి వచ్చింది. మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ పంట లాభసాటిగానే ఉంది. – సుంకర నరసింహులు, సంగసముద్రం

నిలకడైన ఆదాయం



ఈ ఏడాది గెనిసిగడ్డలు ఒక ఎకరంలో సాగు చేశారు. ప్రస్తుతం టమాటా, కూరగాయల సాగు కంటె గెనిసగడ్డలు సాగు ఆదుకొంది. అన్ని ఖర్చులు పోను ఎకరానికి రూ.1.90 లక్షల ఆదాయం వచ్చింది. ఈఏడాది తమిళనాడు రాష్ట్రానికి గెనిసిగడ్డలను ఎగుమతి చేశాం. అక్కడి మార్కెట్లో మంచిధరలు ఉన్నాయి. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవడం వలన రైతులు బాగు పడే అవకాశముంది. – రాజారెడ్డి, మొరంపల్లె

15లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి 15లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం మండలంలోని తవళం గ్రామంలో సారా తయారుచేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో సారా తయారీతో పాటు విక్రయాలు జరుపుతున్న తవళం గ్రామానికి చెందిన తలారి యల్లారెడ్డి, నాగులయ్య గారిపల్లెకు చెందిన నాగరాజును అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.3వేల విలువైన 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి, సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ బాలకృష్ణ

పీలేరు రూరల్ : ప్రస్తుత సమాజంలో సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ యుగంధర్, ఎస్‌ఐ బాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా పెట్టుబడులపై ఆకర్షితులను చేస్తూ వాట్సాప్, టెలీగ్రాం, ఇన్‌స్టాగాం లింకుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ గేమ్స్, లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు వెంకటరామయ్య, రఫీ, కిషోర్‌కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ప్రైవేటు పరం చేస్తే ఉద్యమిస్తాం

బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు చందు


నిరసన వ్యక్తం చేస్తున్న బహుజన సేన నాయకులు

తంబళ్లపల్లె : మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తే ఉద్యమించకతప్పదని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న మదనపల్లె జిల్లా ఆస్పత్రి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని, గ్రామీణ నిరుపేద విద్యార్థులకు సైతం వైద్య చదువు అందుబాటులో తెచ్చేందుకు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందన్నారు. నిర్మాణపు పనులు కూడా 70 శాతం పూర్తికాగా కూటమి ప్రభుత్వం రాగానే పనులు నిలిపివేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నిధుల కోసం పీపీపీ పద్ధతిలో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ఆలోచన విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో బహుజన సేన రాష్ట్ర నాయకులు మనోహర్‌రెడ్డి, రూపానాయక్, వెంకటేష్, సుభాష్‌చంద్రబోస్, ఆటో యూనియన్ నాయకులు రమేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించండి

సామాజిక తనిఖీ బృందానికి విన్నవించిన పీఎంసీ కమిటీ


కేజీబీవీలో సరుకుల నిల్వను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

నిమ్మనపల్లె : ముష్టూరు కస్తుర్బా విద్యాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీఎంసీ కమిటీ సభ్యులు సామాజిక తనిఖీ బృందానికి విన్నవించారు. ఈనెల 26వ తేదీ నుంచి 28 వరకు ముష్టూరు కేజీబీవీ ని డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ ఎస్.పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రత్యేక అధికారి ముని వెంకటమ్మతో కలిసి గ్రామ సభ ఏర్పాటు చేశారు. పీఎంసీ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు పని చేయడం లేదని, మరమ్మతులు చేయించాలన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రస్తుతం ఉన్న సీఈసీ గ్రూపుతో పాటు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం ఎంపీసీ, బైపీసీ వంటి గ్రూపులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సామాజిక తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పాఠశాల కార్యకలాపాల వివరాలు, నిర్వహణ, ఉపాధ్యాయ, విద్యార్థులు ఇతర పాఠశాల రికార్డులు, సామగ్రి నిల్వ గదులు , వంటశాల, వంట సామగ్రి, లైబ్రరీ, ల్యాబ్, తరగతి గదులు విద్యార్థులలోని సామర్థ్యాలతో పాటు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. పాఠశాల నిర్వహణ, వసతులు, సమస్యలపై సూచనలు సలహాలను స్వీకరించామన్నారు. సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తామన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు

పీలేరు రూరల్ : మామిడి సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చునని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. మంగళవారం మండలంలోని తలపులలో అన్నమయ్య రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూతరాని తోటల్లో పూమొగ్గలు ఉత్తేజపరచడానికి పూతరావడానికి, ఆడ పూల శాతం పెరగడానికి పొటాషియం నైట్రేట్ పిచికారి చేయాలన్నారు. అలాగే పూమొగ్గ దశలో తేనెమంచు పురుగు, పక్షిపన్ను తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం అధికంగా ఉన్నందున మోనోక్రోటోఫాస్ గానీ, క్లోరిపైరిపాస్ గానీ చెట్టు కొమ్మలు, కాండము, ఆకులు బాగా తడిచేలా పిచికారి చేయాలన్నారు. నాణ్యతతో కూడి పండ్లు కోసం ఫ్రూట్ కవర్లు కొనుగోలుకు ప్రభుత్వం ఇచ్చే 50 శాతం రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న, పీలేరు ఏడీఏ వై.వి. రమణరావు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీనివాస్ హెచ్‌వో సుకుమార్‌రెడ్డి, అన్నమయ్య రైతు సంఘం అధ్యక్షుడు జయప్పనాయుడు, మామిడి రైతులు పాల్గొన్నారు.

డబ్బులివ్వకపోతే పనిలోకి రావొద్దని బెదిరింపు

- శానిటరీ ఆఫీసర్లను నిలదీసిన వైస్‌చైర్మన్ జింకాచలపతి
- రూ.13.5 కోట్లతో పట్టణంలో అభివృద్ధి పనులు
- ప్రజా అవసరాలకు అనుగుణంగా వసతుల కల్పన


కౌన్సిల్ సమావేశంలో శానిటరీ అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి

మదనపల్లె : ‘పారిశుద్ధ్య కార్మికులను డబ్బులివ్వకపోతే పనిలోకి రావొద్దని శానిటరీ అధికారులు, యూనియన్ లీడర్లు బెదిరిస్తున్నారు. పేదలపై వీరి ప్రతాపమేంటని’ మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి ప్రశ్నించారు?. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మనూజారెడ్డి మాట్లాడుతూ...పట్టణంలోని 35 వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలికవసతుల కల్పనకు రూ.13.5 కోట్లు సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయిలో కార్మికులను నియమించుకుని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలోని ప్రధానకూడళ్లలో హైమాస్ట్ లైట్లు, వీధిదీపాలు ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి సరఫరాను మెరుగుపరిచి, 2–3 రోజుల వ్యవధిలో ప్రతి ఇంటికి నీరు అందేలా చూస్తున్నామన్నారు. వార్డుల్లో ఏవేని ప్రజాసమస్యలు ఉంటే, సభ్యులు కౌన్సిల్ దృష్టికి తెస్తే తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆజెండాలోని అంశాలను చదివి వినిపించగా, అందులోని కొన్ని అంశాలపై సభ్యులు తమ వాదనలు వినిపించారు. అజెండాలో మూడు అంశాలు ర్యాటిఫికేషన్‌కు సంబంధించినవి ఉండటంతో వాటి వివరాలను అడిగారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేసేందుకు కొనుగోలు చేస్తున్న సోపులు, కొబ్బరినూనెకు సంబంధించి కంపెనీల పేర్లను అజెండాలో పొందుపరచకపోవడంపై నిలదీశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికుల హాజరుకు సంబంధించి ప్రతిరోజు ఉదయం 5 గంటలకు వేసే మస్టర్, నిబంధనల ప్రకారం శానిటరీ అధికారులు, సూపర్‌వైజర్స్ వేయాల్సి ఉండగా, ఎక్కడా జరగడం లేదన్నారు. శానిటరీ అధికారులను యూనియన్ లీడర్స్ మచ్చిక చేసుకుని, వారికి బదులుగా వారు మస్టర్ వేస్తూ, కావాల్సిన వ్యక్తులకు హాజరువేయడం, మిగిలిన వారిని ఇబ్బందులకు గురిచేయడం చేస్తున్నారన్నారు. శాలరీ సెక్షన్‌లో అధికారి పక్కన కూర్చుని, తమకు కావాల్సినట్లుగా ఆబ్సెంట్‌లు, ప్రజెంట్‌లు వేసుకుని, కార్మికుల నుంచి వేలాదిరూపాయలు వసూలుచేసే హక్కు ఎవరిచ్చారన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు శానిటరీ అధికారులు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో జీపీఎస్ లొకేషన్‌తో కూడిన మస్టర్ వేసేలా చూడాలన్నారు. 19వవార్డు కౌన్సిలర్ బి.ఎ.ఖాజా మాట్లాడుతూ...మటన్ మార్కెట్‌కు సంబంధించి, మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయంపై ప్రశ్నించారు. 13వవార్డు ఫర్హానాఫీ మాట్లాడుతూ... గాంధీరోడ్డులో ఎంఎల్ఎల్ ఆస్పత్రి సమీపంలో ఆక్రమణ తొలగింపుకు సంబంధించి తీసుకున్న చర్యలపై ప్రశ్నించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం మాట్లాడుతూ..పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని, తక్షణమే నివారణకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. 35వార్డుల్లో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి కార్మికులను నిర్వహణ చేసేందుకు రుషి వెంకటేశ్వర ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించేందుకు ప్రతిపాదించిన 17వ అంశాన్ని పునఃపరిశీలించాల్సిందిగా కోరారు. అనంతరం అజెండాలోని 23, కౌన్సిల్ అత్యవసర సమావేశంలోని 3 అంశాలకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, శ్రీనివాసులు, పాల్ చంద్రశేఖర్, రామిశెట్టిశివయ్య, వసీం, లత తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే జీవన ప్రమాణాల పెంపు

తంబళ్లపల్లె : మహిళలు చదువుకున్నప్పుడే నూతన ఆలోచనలతో ఆర్థిక అభివృద్ధి సాధించి జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చునని ఏపీఎం గంగాధర్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉల్లాస్‌పై శిక్షణ ఇచ్చారు. వయోజన విద్యాశాఖ, డీఆర్‌డీఏ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో నిరక్షరాస్యులైన మహిళలకు చదువు చెప్పేందుకు 48 కేంద్రాలు గుర్తించామన్నారు. ఒక్కో కేంద్రంలో మహిళా సంఘాలలోని 10 మంది నిరక్షరాస్యులకు చదువు నేర్పాలన్నారు. ఇందుకు సంఘమిత్రలు, సీసీలు,వలంటీర్ల టీచర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎంఈఓ త్యాగరాజు, ఏఓ థామస్, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ, ఎంఎస్ అధ్యక్షురాలు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

రామసముద్రం : మండల తహసీల్దార్ నిర్మలాదేవికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న నేపథ్యంలో మంగళవారం సివిల్ సప్లయిస్ డీటీ ఫిరోజ్‌ఖాన్, డీలర్లు, తహసీల్దార్ నిర్మలాదేవిని ఘనంగా సన్మానించారు. శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. ఆమె మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. సన్మాన కార్యక్రమంలో ఎండీయూలు ఇర్షాద్, మధు, మురళి, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువుల పండగ

రామసముద్రం : మండలంలోని కురిజల, ఎర్రప్పల్లె, టి.గొల్లపల్లె గ్రామాల్లో మంగళవారం పశువుల పండుగ ఘనంగా నిర్వహించారు. ఇంటి ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. పశువులను శుభ్రం చేసి, రంగులు పూసి, బెలూన్లతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం కాటమరాజుల ఆలయం వద్ద చిట్లాకంపను చూపించారు. గ్రామంలో బంధుమిత్రుల రాకతో సందడి సందడిగా కనిపించింది.

డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ

మదనపల్లె సిటీ : పంజాబ్ రాష్ట్రం ఘర్షంకర్‌లో జరిగిన 15వ జాతీయ డ్యాన్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో మదనపల్లెకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మదనపల్లెకు చెందిన లిపికశ్రీ, గాలి నందిని(క్లాసికల్ డ్యాన్స్), జూనియర్–1 క్యాటగిరిలో ద్వితీయ స్థానాలు, జశ్విత శ్రీ (క్లాసికల్ డ్యాన్స్) జూనియర్–2 క్యాటగిరిలో తృతీయ స్థానం పొందారని సూర్య డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు సూర్యకుమార్ తెలిపారు. వీరిని ఏపీ డ్యాన్స్ అసోసియేషన్ నాయకులు సురేందర్‌రెడ్డి, మురళీకృష్ణ, మనోహర్ మంగళవారం అభినందించారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్, వార్డన్లను తొలగించాలి

మదనపల్లె సిటీ : ములకలచెరువు కేజీబీవీ ప్రిన్సిపాల్, వార్డన్లను విధుల నుంచి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సామాజిక తనిఖీ బృందంలో కేజీబీవీలో ఊహించని విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రిన్సిపాల్, వార్డన్లు వెట్టిచాకిరి చేయించుకోవడం బాధకరమన్నారు. పేద,బడుగు,బలహీనవర్గాల కోసం ఏర్పాటు చేసిన వసతిగృహాల్లో ఇలాంటివి చోటు చేసుకోవడం బాధకరమన్నారు. విద్యార్థులకు న్యాయం జరగని పక్షంలో విద్యార్థుల తరపున ఆందోళనలు చేస్తామన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లో పూర్తి స్థాయిలో తనిఖీలు చేసి నిజానిజాలు వెలుగులోకి తెచ్చి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలి


ఎంఎఫ్ రవికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : మదనపల్లె ఆర్టీసీ–1 డిపోను ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. రీజియన్‌లోల డిపో మొదటి స్థానం నిలిచిందన్నారు. ఈపీకె–38.61, ఓఆర్ 71.45, కెఎంపిఎల్ 5.40తో వచ్చినట్లు తెలిపారు. డిపోలో ఈపీకె గత ఏడాది కంటే ఎక్కువ ఉన్నందున జోన్–4 నందు సీఐ రేవతికి ప్రశంసాపత్రం అందజేశారన్నారు. బ్యాటరీ లైఫ్ నందు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం నిలిచిందన్నారు. ఇదే ఒరవడితో అందరూ కలిసి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.